

ఓం నమో భగవతే శ్రీరమణాయ



# రమణ భాస్కర

## జిన్నూరులో శ్రీ నాన్నగారి ప్రవచనము, 9-7-98

**ప్రియమైన ఆత్మబంధువుల్లారా,**

ఈ రోజు గురుపూర్ణిమ. గురుపూర్ణిమ అంటే వ్యాసజయంతి, వ్యాసుడు పుట్టినరోజు. ఒకరాశిగా ఉన్న వేదాలను విభజించాడు కాబట్టి ఆయనకు వేదవ్యాసుడు అనే పేరువచ్చింది. భగవద్గీత, ఉపనిషత్‌లు, బ్రహ్మసూత్రాలు వీటిని ప్రస్థానత్రయం అంటారు. ఈ మూడు సమగ్రంగా అధ్యయనం చేస్తేనేగాని హిందూమతం యొక్క స్వరూపం తెలియదు అని పెద్దలు చెపుతారు. వేదాలలో సమస్త విషయాలు చెప్పారు. ఒక్క జ్ఞానం గురించే వేదాలలో చెప్పారు అని అనుకోవద్దు. మన జీవిత విధానం గురించి, ఉపాసనగురించి, వాస్తు శాస్త్రంగురించి, డబ్బు సంపాదించటంగురించి, సంపాదించిన డబ్బును ఎలా వినియోగించాలో ఇలా సమస్త విషయాలు వేదాలలో సమగ్రంగా చెప్పారు. వేదాలయొక్క చివరభాగంలో ఉపనిషత్‌లు ఉన్నాయి. వేదాలయొక్క అంతంలో చెప్పిన ఉపనిషత్‌ల యొక్క సారాన్ని వేదాంతం అని పిలుస్తారు. భారతీయ సాహిత్యం ఇలా ఉండటానికి కారణం వ్యాసుడే. ఆయన భారతం వ్రాసి భారతంలోలేని విషయం లోకంలో ఎక్కడాలేదు అని చెప్పాడు. భారతంలో ఒక భాగమే భగవద్గీత. మన హిందూమతంలో అనేక సాంప్రదాయాలు ఉన్నాయి కాబట్టి ఎవరు ఏశాఖలో ఉన్నా, ఏప్రాంతంలో ఉన్నా వ్యాసుడు పుట్టినరోజున ఎవరి గురువును వారు ఆరాధించుకోమని, గురువు పట్ల కృతజ్ఞత తెలియజేయటంకోసం ఈ వ్యాసపూర్ణిమను గురుపూర్ణిమగా మనపెద్దలు నిర్ణయించారు. రాముడు, కృష్ణుడు అవతారపురుషులు. వారికి గురువు అవసరంలేదు. అయినా గురుశిష్య సాంప్రదాయం నిలబెట్టటంకోసం రాముడు, కృష్ణుడు, శంకరుడు గురువు దగ్గరకు వెళ్ళారు.

కొంతమంది మహాత్ములుగా పుడతారు. కొంతమంది ఈలోకంలో మంచి పనులు చేసి మహాత్ములు అవుతారు. కొంతమంది మహాత్ములుగాపుట్టరు, ఈలోకంలో మంచి పనులుచేయరు కాని మమ్మల్ని మహాత్ములుగా గుర్తించమని సమాజాన్ని పీడిస్తారు. ఈమూడోరకం మహాత్ములుకూడా లోకంలో ఉన్నారు అని షేక్స్‌పియర్ చెప్పాడు. ఏవస్తువు అయితే అది ఉండటం వలననే తెలియబడుతుందో అదే బ్రహ్మం. అది అందరిలోనూ ఉంది, అంతటా ఉంది. అంతేకాదు అది మనమై ఉన్నాము. అది మనమే అయినప్పటికి మనకు ఎందుకు తెలియటంలేదు అంటే దానికి మన మనస్సులో ఉన్న బలహీనతలే కారణం. మనలో ఏబలహీనతలు ఉన్నాయోచూసి వాటిని తొలగించటానికి ఆత్మే కాళ్ళు, చేతులు తొడుక్కొని ఒకరూపం ధరించి గురువుగా వచ్చి నీకు బోధించి చూపుద్వారా, మాటద్వారా, స్పర్శద్వారా అనేకరకాలుగా అనుగ్రహిస్తాడు. గురువు ఆగ్రహంకూడా అనుగ్రహమే అని

తెలిసినవాడు ధన్యుడు, అదృష్టవంతుడు. మనకు ఏది మంచిదో మనకంటే ఎక్కువగా ఈశ్వరుడికి తెలుసు. ఎవడైతే తన భారాన్ని ఈశ్వరుడి మీద ఉంచి జీవిస్తున్నాడో వాడు ఈశ్వర స్వరూపాన్ని పొందుతాడు. దైనందిన జీవితంలో అహంకారరహితంగా జీవించటమే తపస్సు. మన మాటకు, చేతకు, తలంపులకు అహంభావన కేంద్రంగా ఉండకూడదు. దైనందినజీవితంలో అహంభావన కేంద్రంగా కాకుండా ఆత్మని కేంద్రంగా పెట్టుకొని జీవిస్తే, పనిలో భగవంతుడిని చూస్తూ పనిచేస్తూ ఉంటే హృదయంలో ఉన్న సద్వస్తువు తనంతట తానుగా నీకు వ్యక్తమవుతుంది. దానంతట అదిగా వ్యక్తమయితే మనం దర్శించగలము కాని లేకుంటే దానిని దర్శించలేము. నీకు అర్హత ఉంటే, యోగ్యత ఉంటే, బుద్ధి యొక్క లోతులు పెరిగితే వస్తువు వ్యక్తమవుతుంది.

వేదాల సారం ఏమిటి అంటే నీవు ఎవరో నీవు తెలుసుకో నీవు ఎవడో నీకు తెలియకపోతే కోటి జన్మలు ఎత్తినా నీకు మోక్షంరాదు. నీవు ఏమార్గంలో ప్రయాణంచేసినా, ఏ గురువును ఆశ్రయించినా నీవు ఎవరో నీకు తెలియకపోతే నీకు శాంతి లేదు, మోక్షంలేదు. నీవు ఎవడో నీకు తెలియనప్పడు నీకు మోక్షం ఏమిటి ? ప్రకృతితో సంబంధంలేని వస్తువు ఒకటి నీ హృదయంలో ఉంది. అదే బ్రహ్మం, అదే చైతన్యం. నీ తలంపులతో దానికి ఎట్టి సంబంధం లేదు. ఒక్క చైతన్యం తప్పించి అన్నీ తలంపులే. చైతన్యం మాత్రం తలంపుకాదు. నీ భయం ఒక తలంపు, దుఃఖం ఒక తలంపు, చావు పుట్టుకలు తలంపులు. జీవితంలో అన్నీ తలంపులే. నీ హృదయంలో తనంతటతానుగా ప్రకాశిస్తున్న వస్తువు మాత్రం తలంపుకాదు. ఈ వాక్యం అర్థం చేసుకొంటే రీలైజేషన్‌కు దగ్గరకు వస్తావు. భగవాన్ ఎప్పడూ మూఢనమ్మకాలను ఎంకరేజ్ చేయలేదు. ఆయన మోడరన్ మహర్షి. హేతువాదులకు హేతువాది. మానవజాతి అంతా ఏ గమ్యం పొందటానికి ప్రయత్నం చేస్తోందో, దేని కోసం తపస్సులు చేస్తోందో కొన్ని నిమిషాల కాలంలో మరణానుభవం ద్వారా ఆ స్థితిని పొంది మహర్షి అయ్యాడు. ఈ దేహానికి, హృదయంలో ఉన్న సత్యానికి అణుమాత్రం కూడా సంబంధం లేదు. ఆ వస్తువును హేతువాదుల నిరశించినా ఉన్న సద్వస్తువు ఎక్కడికీ పోదు. మీకు ఇష్టం లేకపోతే నా మాటలను మీరు కాదని అనవచ్చు కాని నా హృదయంలో ఉన్న సద్వస్తువుకు సంబంధించిన అనుభవాన్ని మీరు కాదని అనలేరు ఒక వేళ మీరు హేతువాదులు అయినప్పటికి. ఎవరు నిరశించినా ఉన్న వస్తువు లేకుండా పోదు. మీ తలంపు వలన, భావన వలన లేని వస్తువు ఉంది, ఉంది అని చెప్పినా లేని వస్తువుకు ఉండటం అంటూ ఉండదు.

మనం మంచి పని చేస్తే పుణ్యం వస్తుంది. అనుభవిస్తే అదిపోతుంది. నీకు జ్ఞానం కావాలంటే శ్రవణ; మననాలు చాలా ముఖ్యం. శ్రవణం చేయటం కూడా భక్తే. వింటేనే సరిపోతుందా అంటారు. వింటేనే మనకు విషయం అర్థం కావటం లేదు ఇంక వినకపోతే ఏమీ తెలుస్తుంది. ఏదో చేయటం వలన వస్తువు తెలుస్తుంది అని అనుకొంటాడు. ఏదో చేయటం వలన ఇది వచ్చేది కాదు. నీవు దేనితోనూ తాదాప్యం చెందకుండా ఉండటం వలన ఇది వస్తుంది గాని ఏదో చేస్తే ఇది రాదు. నీకు తెలిసినా, తెలియకపోయినా నీ హృదయంలో అది స్వయంగా ప్రకాశిస్తోంది. నీ మనస్సు అణిగినపుడు,

నీ మనస్సుకు అంతర్ దృష్టి కలిగినపుడు, నీలో ఉన్న ప్రకృతి గుణాలు బయటకు పోయినపుడు ఆ వస్తువు నీకు తెలియబడుతుంది గాని ఏదో చేయటం వలన అది తెలయదు. మనకు భగవంతుడి మీద సజీవమైన విశ్వాసం లేదు. మనకు వ్యతిరేక పరిస్థితులు ఉన్నప్పడు భగవంతుడు జ్ఞాపకం వస్తాడు. భగవంతుడితో మనం వ్యాపారం చేయటం నేర్చుకొన్నాము. మనకు భక్తి ఉంది గాని అది కారణభక్తి, కారణ భక్తి వలన మోక్షం రాదు అకారణ భక్తి రజోగుణాన్ని తొలగిస్తుంది, జ్ఞానానికి మార్గాన్ని చూపిస్తుంది. ముందు రెండు విషయాలు నేర్చుకో. నిజం కాని దానిని నమ్మటం ఆపుచెయ్యి ఏదైతే నిజమో దానిని నమ్మటం ప్రారంభించు. నీవు ఎన్ని జన్మలు ఎత్తినా, ఏ సాంప్రదాయంలో ఉన్నా, ఏదేవుని ఉపాసించినప్పటికి నిజంకాని దానిని నీవు నిజం అని నమ్ముతున్నా అది నిజం ఎలా అవుతుంది. అది నిజం కాదు. అందువలన నిజంకాని దానిని నమ్మటం ఆపుచెయ్యి. ఇల్లు కట్టేటప్పడు చాలా చిరాకుగా ఉంటుంది. పనిచేసేవారు అంత రకరకాలుగా అవి, ఇవి కావాలి అని ఇబ్బంది పెడుతూ ఉంటారు. అప్పడు మనకు చాలా కష్టంగా ఉంటుంది. కాని ఇంటిలో ప్రవేశించాక ఇల్లు కట్టేటప్పడు పడిన శ్రమ, చిరాకు అంతా మర్చిపోయి హాయిగా ఉంటాము. అలాగే సాధన చేసేటప్పడు మీకు కొంత కష్టం చిరాకు ఉంటుంది. కాని సాధనాభాగం కొంత కాలం ఉంటుంది తరువాత వెలుతురులోనికి ప్రవేశిస్తావు. రీలైజేషన్ కలిగిన తరువాత కష్టపడ్డా మన్న గుర్తు కూడా నీకు ఉండదు. మీరు గంటలు, రోజులు లెక్క పెట్టుకొంటూ ఏమి సాధన చేస్తారు. ఏ వస్తువు కోసం ప్రయత్నం చేస్తున్నామో ఆ వస్తువు మీద ముందు ఇష్టం ఉండాలి. ఇష్టం ఉన్నచోట మీరు ఎంత సాధన చేసిన మీకు కష్టం ఉండదు.

మన శరీరం మరణించిన తరువాత బంధువులతోటి, స్నేహితుల తోటి సంబంధం తెగిపోతుంది. గాని గురువుతో ఉన్న సంబంధం తెగదు. ఈ శరీరం మరణించిన తరువాత వాసనానుగుణంగా నీవు ఏ శరీరం ధరించినప్పటికి నీవు ఆత్మ సామ్రాజ్యానికి అధిపతి అయ్యేవరకు నిన్ను వెంటాడుతూ ఉంటాడు. నీ స్వరూపం నీకు తెలిసే వరకు నిన్ను వెంటాడుతాడు వాడే గురువు. గురువు ఎడ్రసు మనకు తెలియకపోయినా మన ఎడ్రసు గురువుకు తెలుస్తూ ఉంటుంది. అనేక జన్మ పరం పరల నుండి ఎవడైతే గురువు అని అనుకొన్నానో ఏ గురువు అయితే నన్ను వెంటాడుతూ వస్తున్నాడో వాడు ఇంతకాలం నాకు బయట ఉన్నాడు అనుకున్నాను కాని వాడు నా హృదయం యొక్క లోయలలోనే ఉన్నాడు అని సత్యం నీకు అనుభవం లోనికి వచ్చాక తెలుస్తుంది. భగవంతుడు నీ హృదయంలోనే ఉన్నాడు. నీ దేహప్రారబ్దముననుసరించి నిన్ను నడిపేవాడు నీ హృదయంలోనే ఉన్నాడు. నీ హృదయంలోనే ఉన్న ఈశ్వరుడికి అన్ని భావములతో అన్ని విధముల నీవు శరణాగతి చెందితే ఆయన నీకు ఎరుక పడతాడు. సత్యవస్తువును తెలుసుకోవటానికి అనేక వేలమంది ప్రయత్నం చేస్తూఉంటారు కాని అది అందరికి తెలియబడదు అది ఎవరికి తెలియబడాలి అనిఅనుకొందో వారికే తెలియబడుతుంది.

నీవు ముసుగులో ఉంటావు, నీ బలహీనతలు ఎక్కడో లోపల ఉంటాయి. నేను మంచి వాడిని,

సత్పురుషుడిని అని అనుకొంటావు, కాని నీవు నిజంగా అంత మంచి వాడివి కాదు అని గురువు కు తెలుసు. నీ బలహీనతలు నీకు తెలియవు కాని గురువుకు తెలుస్తూ ఉంటాయి ఆ బలహీనతలను నీకు తెలియజేసి వాటిని తొలగించటానికి నీచేత ప్రయత్నం చేయించి వాటిని గురువు తొలగిస్తాడు. మిమ్మల్ని ఎవరైనా పొగుడుతూ ఉంటే ఆ మాటలు వినకండి. అదే పనిగా ఆ మాటలు వింటూ ఉంటే దేహభావన మీకు తెలియకుండా పెరిగిపోతుంది. మీరు ఎన్ని పూజలు చేసిన, సాధనలు చేసిన మోక్షంరాదు. ఇద్దరు కూర్చొని వారు చాలా పవిత్రులు అయినట్లు మూడో వ్యక్తిని విమర్శిస్తూ ఉంటారు. నిజంగా వారు పవిత్రులు కారు కాని మేము సవిత్రులము అని వారు అనుకొంటారు. ఎక్కడయితే ఇతరులను విమర్శిస్తున్నారో మీరు ఏమీ విమర్శించకుండా అక్కడ కూర్చొన్నా నూటికి నూరుపాళ్ళు మీకు అహంభావన పెరుగుతుంది. అందువలన మిమ్మల్ని ఎవరైనా పొగుడుతూ ఉంటే ఆ మాటలు వినవద్దు, ఎక్కడయితే ఇతరులను విమర్శిస్తున్నారో అక్కడ కూర్చోవద్దు. జపాలు చేయటం, ధ్యానాలు చేయటం, ప్రాణాయామం చేయటం తరువాత చూద్దాము ముందు ఈ రెండు పనులు నేర్చుకోండి. ఈ రెండూ అభ్యాసం చేస్తే 50% అహంభావన తగ్గిపోతుంది.

కర్మఫలం గురించి కంగారు పడకండి. మంచి కర్మచేస్తే మంచి ఫలితం, చెడు కర్మచేస్తే చెడు ఫలితం అనుభవంలోనికి వస్తుంది. కర్మ ఫలంతో తాదాప్యం చెందవద్దు. దేహం ఈ భూమి మీదకు ఎందుకు వచ్చిందో ఆ పని పూర్తి అయిన తరువాత దేహం పోతుంది. కర్మానుగుణంగా దేహ యాత్ర సాగుతూ ఉంటుంది. కాని కర్మఫలంతో నీవు తాదాప్యం పొందకు, నీ సాధన యొక్క శక్తి అక్కడే చూపించవలసి ఉంటుంది. నీవు కర్మఫలంతో తాదాప్యం లేకుండా ఉంటే సుఖ ప్రారబ్దం ఉన్నా దుఃఖ ప్రారబ్దం ఉన్నా దాని ఫలం నిన్ను అంటదు, ముట్టదు. నీ హృదయంలో ఉన్న నిజం నీకు తెలిస్తే కర్మఫలంతో తాదాప్యం లేకపోవటమేకాదు అసలు కర్తవే నీవు కాదు అని తెలుస్తుంది. వస్తువు దూరముగా ఉన్నది, దగ్గరగా ఉన్నది అని ఉపనిషత్‌లో చెప్పారు. ఎవరికి దూరంగా ఉన్నది, ఎవరికి దగ్గరగా ఉన్నది అంటే తెలిసిన వారికి దగ్గరగా ఉన్నది, తెలియని వారికి దూరంగా ఉన్నది. దీనికి భగవాన్ ఏమి చెప్పారు అంటే దగ్గర ఏమిటి ? దూరం ఏమిటి? అదే నీవు అని భగవాన్ చెప్పారు.